ఈనాడు
ఖమ్మం
శుక్రవారం అక్టోబరు 4, 2024 5

ఎక్కడి పనులు అక్కడే..!

ఈటీవీ, ఖమ్మం, న్యూస్‌టుడే, ఖమ్మం గ్రామీణం: ఖమ్మం జిల్లాలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల శాశ్వత భవన నిర్మాణ పనుల్లో కదలిక కనిపించటం లేదు. అరకొర సౌకర్యాల మధ్యే ఇంజినీరింగ్ విద్యనభ్యసించాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.300 కోట్ల అంచనాతో కళాశాల భవనం నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటికే తొలి విడతగా రూ.100 కోట్ల పనులపై అధికారులు సర్కారుకు ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం పచ్చజెండా ఊపకపోవటంతో పనులు ప్రారంభమవలేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే ఏడాదైనా శాశ్వత భవనంలోనే తరగతులు నిర్వహించాలన్న సర్కారు లక్ష్యం నెరవేరేలా కనిపించటం లేదు.


వైటీసీ భవనంలో కొనసాగుతున్న జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల

ప్రభుత్వానికి రూ.100 కోట్లతో ప్రతిపాదనలు

కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి మద్దులపల్లి రెవెన్యూ పరిధిలో 30 ఎకరాల భూమిని అధికారులు కేటాయించారు. భవన నిర్మాణానికి జేఎన్‌టీయూ అధికారులు కాంటూరు సర్వే చేపట్టారు. తొలి విడతగా తరగతులు, అకడమిక్ భవనం, పరిపాలన భవనం, వసతిగృహాలు, ప్రయోగశాలల నిర్మాణానికి రూ.100 కోట్లతో సర్కారుకు ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వ అనుమతి రాగానే మొదటి విడత పనులు మొదలవుతాయి. తదనంతరం కళాశాల అవసరాలకు అనుగుణంగా మరికొన్ని భవనాల నిర్మాణానికి రూ.200 కోట్లు కావాలని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

మంత్రి పొంగులేటి చొరవ చూపాలని..

కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం గ్రానైట్ వ్యర్థాలు, బండరాళ్లతో నిండిపోయింది. ఇప్పటివరకు చదును చేసే పనులు మొదలుకాలేదు. ఈ పనులకే నెలల తరబడి సమయం పట్టే అవకాశముంది. ప్రభుత్వం అనుమతులు జారీ చేస్తే టెండర్ ప్రక్రియకు ముందడుగు పడనుంది. శాశ్వత భవనం వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి అందుబాటులోకి రావాలంటే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ చూపాలని విద్యార్థులు కోరుతున్నారు.

కొత్త భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు అద్దె భవనంలోనే జేఎన్‌టీయూ కళాశాల తరగతులు నిర్వహిస్తాం. వైటీసీలో కొనసాగుతున్న కళాశాలను జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్లు ఇటీవల పరిశీలించారు. శాశ్వత భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని సందర్శించారు. త్వరలోనే ప్రభుత్వం నుంచి నిధులు విడుదలవుతాయని ఆశిస్తున్నాం.

- రమేశ్, ప్రిన్సిపల్, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల

అరకొర వసతులతో అవస్థలు

గత ప్రభుత్వ హయాంలో కౌన్సెలింగ్ సమయంలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల మంజూరైంది. ఖమ్మం గ్రామీణ మండలం మద్దులపల్లిలోని యువజన శిక్షణ కేంద్రం (వైటీసీ) భవనంలో తాత్కాలికంగా కళాశాలను నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో 79 (సీఎస్‌ఈ-61, డేటా సైన్స్-18) మంది అభ్యసిస్తున్నారు. ఈఏడాది ప్రథమ సంవత్సరంలో 144 (డేటా సైన్స్-35, సీఎస్‌ఈ-63, ఈసీఈ-27, ఈఈఈ-14, మెకానికల్-05) మంది ప్రవేశాలు పొందారు. మొత్తం మీద 223 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడే తరగతులతో పాటు ప్రయోగశాలను నిర్వహిస్తున్నారు. బాలురకు వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. బాలికల వసతి కోసం ప్రైవేటు భవన సముదాయాన్ని అద్దెకు తీసుకున్నారు.

ప్రశాంతంగా సార్వత్రిక పరీక్షలు

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ సార్వత్రిక పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగినట్లు డీఈఓ సోమశేఖరశర్మ, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ సమన్వయకర్త మద్దినేని పాపారావు తెలిపారు. పదోతరగతి పరీక్షకు 58 మందికి గానూ 44 మంది, ఇంటర్ పరీక్షకు 47 మందికి 35 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు, పరీక్షల విభాగం సహాయ కమిషనర్ కమిషనర్ కె.దన పరిశీలించారు.

14న ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభం

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: మూడో విడత కౌన్సెలింగ్ పూర్తైన వెంటనే ఈనెల 14న ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరరావు తెలిపారు. ఇప్పటికే ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు గురువారం క్లినికల్ తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో ఆయన మాట్లాడారు. కళాశాలలో ఈ ఏడాది తరగతుల నిర్వహణకు సంబంధించి వార్షిక షెడ్యూల్‌ను ఇప్పటికే రూపొందించామని ప్రకటించారు. ఎంబీబీఎస్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని.. ఈ నేపథ్యంలో తొలివిడత స్థానిక కోటా కింద సీట్లు సాధించిన 65, జాతీయ కోటాలో 12 మంది విద్యార్థులు ఖమ్మం కళాశాలలో ప్రవేశాలు తీసుకున్నారని వెల్లడించారు. విద్యార్థులకు వసతి సదుపాయం, ఇతర సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడుతున్నామన్నారు. బాలికల వసతిగృహానికి మరిన్ని మంచాలు, ఇతర వస్తువులు అవసరమని ఉన్నతాధికారులకు నివేదించినట్లు వివరించారు.


కళాశాలలో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థికి ధ్రువపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ రాజేశ్వరరావు


బతుకమ్మలను ఎత్తుకొస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఉద్యోగినులు

‘ప్రతి కుటుంబానికీ డిజిటల్ కార్డు’


మాట్లాడుతున్న సురేంద్రమోహన్

కూసుమంచి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ అన్ని వివరాలతో కూడిన డిజిటల్ కార్డు జారీకి ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందని సీనియర్ ఐఏఎస్ అధికారి సురేంద్రమోహన్ అన్నారు. కూసుమంచి మండలం ధర్మాతండాలో చేపట్టిన సర్వే తీరును గురువారం పరిశీలించారు. స్థానికంగా విలేకర్లతో మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల్లో సోషల్ సెక్యూరిటీ కార్డుల తరహాలో మన రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ, వ్యక్తిగతంగానూ పూర్తి వివరాలతో డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో రెండు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసినట్లు చెప్పారు. సర్వే ఈ నెల 9 వరకు కొనసాగుతుందని, ఆ తర్వాత జిల్లా స్థాయిలో డేటా ఎంట్రీ ప్రక్రియ జరుగుతుందన్నారు. డేటా ఎంట్రీ నమోదులో పొరపాట్లకు తావివ్వకుండా చూస్తామని తెలపారు. పూర్తి సమాచారం ఇచ్చేందుకు కుటుంబాలు సహకరించాలని కోరారు. పాలేరు నియోజకవర్గ ఆర్‌ఓ రాజేశ్వరి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఉప తహసీల్దార్ కరుణశ్రీ, ఎంపీఓ రామచంద్రరావు, ఆర్‌ఐలు బి.రాము, వసంత పాల్గొన్నారు.

అధికారుల నోట.. బతుకమ్మ పాట

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మ సంబురాలను గురువారం నిర్వహించారు. ఉద్యోగినులు ముగ్గులు వేసి వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఉద్యోగినులు ఆడిపాడారు.


ఉద్యోగినులతో కలిసి చైల్డ్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 1098 ను ప్రదర్శిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ధాన్యం కొనుగోలు సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్ 1077

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలులో సమస్యలు తెలిపేందుకు కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నంబర్ 1077 ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులతో కలసి కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోలు ఏర్పాట్లు, డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన, నియామక పత్రాలు జారీ తదితర అంశాలపై సీఎం సమీక్షించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 236 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదించామని, అవసరమైతే మరిన్ని కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్లు శ్రీజ, మధుసూదన్‌నాయక్, అదనపు డీసీపీ ప్రసాదరావు, డీఆర్డీఓ సన్యాసయ్య, డీఎస్ఓ చందన్‌కుమార్, డీఈఓ సోమశేఖరశర్మ, డీఏఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ అన్నారు. ఖమ్మంలో గురువారం నిర్వహించిన సంఘం జిల్లా సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. సీపీఎస్ రద్దుకు పోరాడతామని తెలిపారు. ఉపాధ్యాయులకు 20 వేల పైగా ఉద్యోగోన్నతులు కల్పించిన ఘనత తమ సంఘానిదేనన్నారు. పీఎస్‌హెచ్‌ఎంల ఉద్యోగోన్నతులు, సీపీఎస్ రద్దుకు కృషి చేస్తామని చెప్పారు. కేజీబీవీ, గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యత్నిస్తామన్నారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యలమద్ది వెంకటేశ్వర్లు, ఆర్.రంగారావు, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి హరిప్రసాద్, జడ్పీటీసీ మాజీ సభ్యులు నంబూరి కనకదుర్గ, చిత్తలూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, వేదికపై వెంకటేశ్వర్లు, రంగారావు తదితరులు

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా ‘యలమద్ది’: పీఆర్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యలమద్ది వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.రంగారావు తిరిగి ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా విజయ్ అమృత్‌కుమార్, కట్టాశేఖర్‌రావు, బ్రహ్మారెడ్డి, రత్నకుమార్, శ్రీనివాస్, కార్యదర్శులుగా చెన్నకేశవరెడ్డి, సోమ్లానాయక్, చంద్రశేఖర్, కమలాకర్‌రెడ్డి, నాగరాజు, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా జయమ్మ ఎన్నికయ్యారు.

11న భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో టార్చ్ రిలే

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: సీఎం కప్ క్రీడా పోటీలను మూడంచెల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముందస్తు అవగాహన కోసం ఈనెల 18 వరకు అన్ని జిల్లాల్లో టార్చ్ రిలే, 10కె రన్ నిర్వహించాలని సూచించింది. ఈనెల 11న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ కార్యక్రమం జరగనుంది. 11వ తేదీ ఉదయం కొత్తగూడెం పట్టణంలోని బొమ్మనపల్లి నుంచి సింగరేణి ప్రకాశం స్టేడియం వరకు 10కె పరుగు ఉంటుంది. అదేరోజు సాయంత్రం ఖమ్మం కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్ కార్యాలయం వరకు 10కె రన్ జరగనుంది. టార్చ్ రిలే వాహన శ్రేణి 11వ తేదీ ఉదయం ములుగు బస్టాండ్ సెంటర్‌లో ప్రారంభమై సుజాతనగర్, జూలూరుపాడు, ఏన్కూరు, మంగాపురం, కొణిజర్ల, వెంకటాయపాలెం మీదుగా ఖమ్మం కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకుంటుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో టార్చ్ రిలే కార్యక్రమాన్ని డీవైఎస్‌ఓలు సునీల్‌రెడ్డి, పరంధామరెడ్డి పర్యవేక్షించనున్నారు.

శ్రీహరిని పట్టించుకునేవారేరీ..!

◆ఎనిమిదేళ్లుగా పాలకవర్గం కరవు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండో అతి పెద్ద దేవాలయం, తెలంగాణ తిరుపతిగా పేరొందిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఇన్‌ఛార్జి అధికారుల పాలనలో కొనసాగుతోంది. ఎనిమిదేళ్లుగా పాలకమండలి నియామకం లేకపోవటంతో పర్యవేక్షణ కరవైంది. అభివృద్ధి ప్రతిపాదనలు కార్యరూపం దాల్చక, సకాలంలో సమస్యలు పరిష్కారం కాక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క శ్రీవారి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.



జమలాపురం శ్రీవారి ఆలయం

ఆలయ విశిష్టత

ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి 62.5 ఎకరాల మాన్యం ఉంది. అన్నదానానికి రూ.3కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. ఈ డిపాజిట్ల ద్వారా వచ్చిన వడ్డీతో భక్తులకు అన్నదానం అందిస్తున్నారు. ఆలయానికి హుండీ, టికెట్లు, దుకాణాలు, తలనీలాల వేలం ద్వారా సంవత్సరానికి దాదాపు రూ.6 కోట్ల ఆదాయం వస్తోంది. ఇంత స్థితి ఉన్నా అందుకు తగిన రీతిలో సదుపాయాలు లేవని, ప్రాథమిక సమాచారం లేని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరుకుపోతున్న సమస్యలు

★ ఆలయ ప్రాంగణాన్ని పెంచే క్రమంలో భాగంగా చుట్టూ ప్రాకార మండపం, మాడవీధులు, రాజగోపురాలు, గిరిప్రదక్షిణ మాడవీధుల నిర్మించాలనుకున్నా గతేడాది ఆలయ అధికారులు, ధర్మకర్తలు ప్రభుత్వానికి నివేదించారు. నేటికీ ఆ విషయంలో పురోగతి లేదు.

★ ప్రాంగణంలో భక్తులు స్నానమాచరించేందుకు దాత రూ.40 లక్షలతో నిర్మించిన పుష్కరిణి నిరుపయోగంగా ఉంటోంది. దీన్ని వినియోగంలోకి తేవాలి.

★ కొండ కింద పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం లేదు. దీంతో దూరప్రాంతాల నుంచి వ్యక్తిగత వాహనాలపై వచ్చిన భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

★ సాధారణ రోజుల్లో 150 మందికి మాత్రమే అన్న ప్రసాదాలు సమకూరుస్తున్నారు. ఈ సంఖ్య 250కు పెంచాలి. శని, ఆదివారాల్లో భక్తుల రద్దీ దృష్ట్యా 300 టోకెన్ల నుంచి 500కు పెంచాలి.

★ పర్యవేక్షణ లేకపోవటంతో విధి నిర్వహణలో కొంతమంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

ఏం చేయాలి?

1 శ్రీవారి ఆలయానికి సహాయ కమిషనర్ స్థాయి అధికారిని నియమించాల్సి ఉంది. ఖమ్మంలోని నరసింహస్వామి ఆలయ (గ్రేడ్-2) ఈఓ జగన్మోహన్‌రావు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. మధిర ఆలయం, కూసుమంచి శివాలయం, కొత్తగూడెం ఆలయాల బాధ్యతలూ ఆయనే నిర్వర్తిస్తున్నారు. దీంతో స్థానిక ఆలయంలో నిరంతర పర్యవేక్షణ కరవైంది.

2 శ్రీవారి ఆలయానికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒక్కసారి పాలకవర్గం ఏర్పాటు చేశారు. దాదాపు ఎనిమిదేళ్లుగా పాలకవర్గం లేదు. దీంతో ఆలయ అభివృద్ధికి నిధులు కోరే నాథుడు కరవయ్యారు. ప్రభుత్వం ద్వారా నిధులు పొందేందుకు నూతన పాలకవర్గం ఏర్పాటు చేయాలని, వసతి పెంచాలని భక్తులు కోరుతున్నారు.

దేవాదాయ శాఖలో కొన్నేళ్లుగా పదోన్నతులు లేకపోవటంతో ఇతర ఆలయాలకు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది. ఎక్కువ సమయం కేటాయిస్తూ ఆలయ పర్యవేక్షణ చేస్తున్నాం. పాలకమండలి ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వాలి. - కె.జగన్మోహన్‌రావు, ఆలయ ఈఓ

ఆహ్లాదం.. విజ్ఞాన విహారం

కొత్తగూడెం సింగరేణి, ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒత్తిడితో కూడిన చదువులు విద్యార్థులను సతమతం చేస్తున్నాయి. వారికి బాహ్య ప్రపంచ విజ్ఞానం అంతగా తెలియకుండా పోతోంది. గతంలో మాదిరిగా పర్యాటక, విజ్ఞాన యాత్రలను విద్యాలయాల్లో ప్రస్తుతం నిర్వహించడం లేదు. కానీ, ఒకరోజు యాత్రలు వారిలో నూతనోత్సాహాన్ని ఎంతో కలిగిస్తాయి. ఇటీవల పర్యాటక దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన యువజన కళాకారులు, క్రీడాకారులు, జాతీయ సేవా పథకం విద్యార్థులు చంద్రుగొండ మండలం బెండాలపాడు కనకగిరి గుట్టలను సందర్శించారు. ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల బృందం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చొరవతో కనకగిరి గుట్టల్లోని పులిగుండాలను సందర్శించింది. తామంతా అటవీ, పర్యాటక, చారిత్రక విశేషాలను ఎంతో ఆసక్తిగా తెలుసుకున్నట్లు సందర్శకులు 'న్యూస్‌టుడే'తో అభిప్రాయపడ్డారు. ఉమ్మడి జిల్లాలో 238 జూనియర్, 92 డిగ్రీ కళాశాలలున్నాయి. ఇలాంటి సందర్శనలను అన్ని కళాశాలలతో పాటు ఉన్నత పాఠశాలల్లో చేపడితే బాగుంటుందని పేర్కొన్నారు.



విహారయాత్రలో కొత్తగూడెం యువత సందడి



పులిగుండాల ప్రాజెక్టు సందర్శనలో ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు



కనకగిరి గుట్టలను సందర్శించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. అక్కడి పురాతన వీరభద్రస్వామి ఆలయం విశేషాలను తెలుసుకున్నాం. నాకు ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. ఆలయ సందర్శనతో మానసిక ప్రశాంతత పొందా. - వి.శృతి, డిగ్రీ తృతీయ సంవత్సరం, గిరిజన సంక్షేమ కళాశాల, కొత్తగూడెం

నిత్యం చదువు, భవిష్యత్ లక్ష్యం వంటి ఒత్తిళ్లతో ఇబ్బంది పడే నేటి విద్యార్థి, యువత లోకానికి బెండాలపాడు వంటి విహార యాత్రలు ఆహ్లాదాన్నిస్తాయి. ప్రకృతిని కూడా ఒక తరగతి గదిలా భావిస్తా. ఇలాంటి యాత్రలు విద్యార్థులకు నూతనోత్తేజాన్నిస్తాయి. - మడివి పవన్, టేకులపల్లి, ములకలపల్లి మండలం

మాది మహబూబాబాద్ జిల్లా చంద్రగిరి. కళాశాల తరఫున బెండాలపాడు వద్దనున్న వీరభద్రస్వామి ఆలయం, ఏనుగుల బావి, పసుపువాగు, సమ్మక్క, సారక్క గద్దెల్ని సందర్శించడం మరచిపోలేని అనుభూతినిచ్చింది. లెపార్డ్ టవర్ మీదుగా చూస్తే.. కనగిరి గుట్టల అందాలు కళ్లెదుట సాక్షాత్కరించాయి. - బి.వీణ, డిగ్రీ విద్యార్థి, కొత్తగూడెం

ఒకరోజు విహార యాత్రలో భాగంగా చాలా ఏళ్ల తర్వాత ఫారెస్ట్ ట్రెక్కింగ్‌కి వెళ్లా. పులిగుండాలలోని దేవాలయ పరిసర ప్రాంతాలు ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయి. ఆ సిస్టం ఎంతో నచ్చింది. ప్రతి ప్రాంతం విశేషాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నాం. - హారిక, బీఎస్సీ రెండో సంవత్సరం, ఖమ్మం



తోటి విద్యార్థులతో కలిసి పులిగుండాల ప్రాజెక్టును సందర్శించా. అక్కడి ప్రకృతి అందాలు మమ్మల్ని కట్టిపడేశాయి. మనకు అత్యంత సమీపంలోనే ఇలాంటి అద్భుత ప్రదేశాన్ని తొలిసారి సందర్శించా. పర్యాటక విశేషాల్ని అటవీ శాఖ అధికారులు పరిచయం చేశారు. - సుష్మా స్వరాజ్, బీఎస్సీ ఫైనలియర్, ఖమ్మం

జిల్లా కేంద్రానికి సమీపంలో.. అందమైన కొండల నడుమనున్న పులిగుండాల ప్రాజెక్టును ఉమ్మడి జిల్లా వాసులందరూ చూడదగిన పర్యాటక ప్రదేశం. గంగల పారే సెలయేళ్లు, వన్యప్రాణుల సందడి, పక్షి, వృక్ష జాతుల సమూహాలను విద్యార్థులకు పరిచయం చేసే మరిచిపోలేని అనుభూతినిస్తుంది. - జి.శిరీష, బీఎస్సీ విద్యార్థిని, ఖమ్మం

ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయం

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణే ధ్యేయంగా ప్రభుత్వం డయల్-100 ఏర్పాటు చేసిందని ఖమ్మం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నంబరుకు సెప్టెంబరు నెలలో 5,511 కాల్స్ వచ్చాయని వీటిపై స్పందించి 81 కేసులు నమోదు చేశామన్నారు. మహిళలపై వేధింపులు 2, దొంగతనాలు 9, సాధారణ ఘాతాలు 26, రోడ్డు ప్రమాదాలు 11, అనుమానాస్పద మరణాలు 10, ఇతర కేసులు 23 నమోదయ్యాయని పేర్కొన్నారు. కొందరు డయల్-100పై అవగాహన లేకపోవడంతో నకిలీ కాల్స్ చేస్తున్నారని, ఎవ్వరూ అలా చేయవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డయల్-100కు ఫోన్ చేసి సహాయం పొందాలని తెలిపారు.

అవినీతిపరులు వెళ్లిపోండి.. సమయపాలన పాటించాల్సిందే: కలెక్టర్

ఖమ్మం నగరం: 'అవినీతికి పాల్పడేవారు ఇక్కడ పనిచేయాల్సిన అవసరం లేదు. వేరే ప్రాంతానికి వెళ్లిపోండి. లంచాలు ఆశిస్తే కఠిన చర్యలు తప్పవు.. పైరవీలకు తావులేదు. ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వహించాల్సిందే'నని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ హెచ్చరించారు. నూతన కలెక్టరేట్‌లో సుమారు 33 శాఖల కార్యాలయాలున్నాయి. 500 మంది వరకు ఉద్యోగులు, అధికారులు పనిచేస్తున్నారు. ఇటీవల కలెక్టర్ వివిధ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒక్కో కార్యాలయంలో ఇద్దరు, ముగ్గురు ఉద్యోగులు మాత్రమే కనిపించారు. మిగతా కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. విద్య, వైద్యారోగ్య శాఖ సహా వివిధ శాఖల కార్యాలయాల్లో ఉద్యోగులు విధులకు డుమ్మాకొట్టారు. కలెక్టర్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. మినిస్టీరియల్ ఉద్యోగులు సైతం పనివేళల్లో సీట్లలో లేకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. ఉద్యోగుల హాజరును తెప్పించి పరిశీలించారు. ఎక్కువమంది సమయపాలన పాటించట్లేదని గుర్తించారు. అన్నిశాఖల అధికారులు, కార్యాలయాల పర్యవేక్షకులతో కలెక్టర్ ఈనెల 1న ప్రత్యేకంగా సమావేశమై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది.

☆ ఐడీఓసీలోని అన్ని శాఖల కార్యాలయాల్లో ఉద్యోగులు స్మార్ట్ ఫోన్‌లోని యాప్ ద్వారా ఉదయం 10.30 కంటే ముందే ఫేస్ రీడింగ్‌తో హాజరు నమోదుచేస్తారు. ఈ యాప్ ఐడీఓసీ భవనం పరిధిలో మాత్రమే పనిచేస్తుంది. సాయంత్రం 5.30 గంటలకు బయటకు వెళుతున్నట్లు నమోదవుతారు. బయోమెట్రిక్ హాజరును ఆయా శాఖల అధికారులు రోజూ పర్యవేక్షించాల్సి ఉండగా పట్టించుకున్న దాఖలాలు లేవు. గుర్తించిన కలెక్టర్ నివేదిక పంపాలని ఆదేశించినట్లు తెలిసింది. అన్ని శాఖల వ్యవహారాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ ప్రతి శనివారం సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిసింది. అదనపు కలెక్టర్ శ్రీజ కలెక్టరేట్‌లో వివిధ శాఖల కార్యాలయాలను గురువారం తనిఖీ చేశారు. రెండు రోజులుగా ఉద్యోగుల ప్రవర్తనలో మార్పు కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు.

ఉత్తమ సేవలకు జాతీయ స్థాయి గుర్తింపు

చింతకాని: వందనం పంచాయతీ కార్యదర్శి ఎ.శ్రీనివాసరావుకు గుర్తింపు లభించింది. గాంధీ జయంతిరోజు దిల్లీలో సచ్ఛతాహీ సేవా ముగింపు కార్యక్రమంలో పాల్గొనే అవకాశం రాష్ట్రంలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు దక్కగా వారిలో శ్రీనివాసరావు ఒకరు. ఈయన గతంలో కల్లూరు మండలం కొర్లగూడెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. ఆ సమయంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, డంపింగ్ యార్డు నిర్వహణ, నూరుశాతం మరుగుదొడ్ల వినియోగం, స్వచ్ఛభారత్ మిషన్, పంచాయతీలో రికార్డుల నిర్వహణ వంటి కార్యక్రమాల్లో ముందజంలో ఉండేవారు. ఈసందర్భంగా దిల్లీలో ఉన్నతాధికారుల నుంచి పురస్కారాన్ని గురువారం అందుకున్నారు.





నగరం సిగలో అరణ్య హొయలు

ఖమ్మం నగర శివారులోని వెలుగుమట్ల అటవీ శాఖ పార్కులోవి ఈ దృశ్యాలు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో అభయారణ్యాన్ని తలపించే అడవి చూపరులను ఆకట్టుకుంటోంది. ప్రభుత్వం ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల గ్రామ పరిధిలో అటవీశాఖ పార్కును అభివృద్ధి చేసింది. సుమారు 400 ఎకరాల్లో వృక్ష సంపదతోపాటు పలురకాల ఔషధ మొక్కలను ఇక్కడ పెంచుతున్నారు. పలు రకాల పక్షులు, అడవి పందులు, కుందేళ్లు, నక్కలు, నెమళ్ల వంటి వన్యప్రాణులు ఆశ్రయం పొందుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అడ్వెంచర్ ఆటలు, సఫారీ వాహనం, వ్యూపాయింట్లు, సైక్లింగ్ వంటి సదుపాయాలు కల్పించారు. 100 రకాల ఔషధ మొక్కలను ఇక్కడ సంరక్షిస్తున్నారు.

– ఈనాడు, ఖమ్మం, న్యూస్‌టుడే, ఖమ్మం వ్యవసాయం

జీపీఎస్ ట్రాకర్ పక్షి దొరికిందోచ్..



చర్లలోని అటవీశాఖ సంరక్షణలో జీపీఎస్ ట్రాకర్ పక్షి

చర్ల, న్యూస్‌టుడే: చర్లలో ఇటీవల జీపీఎస్ ట్రాకర్ ద్వారా సంచరించిన పక్షి ఎట్టకేలకు అటవీశాఖాధికారులకు గురువారం చిక్కింది. చర్లలోని నాయకకాలనీలోని ఏకలవ్య విద్యాలయం ప్రాంతంలోని గుట్ట సమీపంలోకి వచ్చిన పక్షి ఎటూ కదలకుండా ఉండటాన్ని గమనించిన స్థానికులు దానికి కోడి మాంసం పెట్టారు. తర్వాత ఎగిరి వెళ్లిపోయింది. ఈ పక్షి సంచారంపై 'ఈనాడు'లో ఈనెల 2న 'జీపీఎస్ ట్రాకర్‌తో గద్ద సంచారం' కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అరుదైన రాబందు సంతతికి చెందిన ఈ పక్షికి జీపీఎస్ ట్రాకర్, కెమెరా ఉన్నట్లు భావించడంతో స్థానికంగా దీని సంచారం కలకలం రేపింది. ఈ పక్షి సంచారంపై నిఘా వర్గాలతో పాటు పోలీసులు కూపీ లాగారు. జీపీఎస్ ట్రాకర్‌తో ఉన్న ఈ పక్షి ఆచూకీ కోసం చర్ల, ములుగు జిల్లా వెంకటాపురం అటవీశాఖ బృందాలు అన్వేషించాయి. జీపీఎస్ ఆధారంగా ఈ పక్షి ఆచూకీ ఎట్టకేలకు లభ్యమైంది. చర్ల మండలం తాలిపేరు పరీవాహక చినమిడిసిలేరు ప్రాంతంలో దీనిని పట్టుకున్న అటవీశాఖ సిబ్బంది చర్లలోని కార్యాలయానికి తరలించారు. అత్యధిక దూరం ప్రయాణించి నీరసంగా ఉండటంతో ఈ పక్షికి తగిన ఫీడింగ్ ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. అంతరించిపోతున్న ఈ రకం పక్షులు ఎక్కడ ఉన్నాయనే దాంతోనే ఈ పక్షికి జీపీఎస్ ట్రాకర్ ద్వారా పంపించి ఉంటారని అటవీక్షేత్రాధికారి ద్వాలియా 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ప్రస్తుతం ఈ పక్షి తమ సంరక్షణలోనే ఉందన్నారు. ఈ పక్షికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు. ఈ పక్షిని అడవిలో వదిలేయాలా? లేక ఎక్కడి నుంచి వచ్చిందో అక్కడికి చేర్చాలనేది ఉన్నతాధికారుల నిర్ణయంపై ఆధారపడి ఉందన్నారు.

శరణము దేవీ.. అభయము నీవే!

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఖమ్మం నగరంలో పలు ప్రాంతాల్లో అర్చకుల వేద మంత్రోచ్చారణల నడుమ దుర్గామాత విగ్రహాలను నిర్వాహకులు మండపాల్లో ప్రతిష్ఠించారు. అమ్మవారి దేవాలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు భారీగా హాజరై అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలువురు భక్తులు అమ్మవారి దీక్ష మాలధారణ తీసుకొన్నారు. నగరంలోని శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం(గుట్ట)లో అమ్మవారు ఆదిలక్ష్మీ, గుట్టలబజారులోని శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో శ్రీబాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పారువేట స్థలం(జమ్మిబండ)లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, నీరాజన మంత్రపుష్పం జరిగాయి.

ఎర్రుపాలెం: జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున శ్రీనివాసుడికి పంచామృతాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. సాయంత్రం శుభమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, గోవింద నామస్మరణల నడుమ తీర్థపుబిందె తీసుకువచ్చి యాగశాల ప్రవేశం జరిపారు. ఆలయ ఈఓ జగన్మోహన్ రావు, ధర్మకర్త శ్రీరామచంద్రమూర్తి, దాత తూళ్లూరు కోటేశ్వరరావు దంపతులు, వేమిరెడ్డి వెంకటరెడ్డి జ్యోతిని వెలిగించారు. విశేష పూజలు, నీరాజన మంత్ర పుష్పాలు జరిపారు. పర్యవేక్షకురాలు విజయకుమారి, ప్రధానార్చకుడు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, అర్చకులు పాల్గొన్నారు.



శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో ఆదిలక్ష్మీ అలంకరణ



శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు

వృత్తి నైపుణ్యంతోనే విధుల్లో రాణింపు

వరంగల్‌క్రైం: పోలీస్‌శాఖలో పనిచేస్తున్న అధికారులు విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం కమిషనరేట్‌లో వరంగల్, ఖమ్మం కమిషనరేట్లు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన అధికారుల జోనల్ డ్యూటీ మీట్‌ను ఆయన ప్రారంభించారు. పోలీసు అధికారులకు కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, వేలిముద్రల సేకరణ, హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫొటో, వీడియోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఒక్కో విభాగంలో ఇద్దరు చొప్పున ప్రతిభ కనబర్చినవారిని ఎంపిక చేసి, హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోలీసు డ్యూటీ మీట్‌కు పంపించనున్నారు.

రెండో రోజు ధ్రువపత్రాల పరిశీలన



పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. ఖమ్మం నగరంలోని రోటరీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరిశీలన కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఎస్జీటీ పోస్టుల అభ్యర్థుల కోసం 8 తనిఖీ బృందాలు, స్కూల్ అసిస్టెంట్‌కు 6 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డీఎస్సీ పోస్టుల భర్తీకి 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసిందన్నారు. జిల్లా పరిధిలో ఎస్జీటీ 508, స్కూల్ అసిస్టెంట్లు 855, ఎల్పీ 49, పీఈటీలు పీఈటీలు 30 మంది మొత్తం 1,442 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని అన్నారు. వీరి ధ్రువపత్రాలను అవసరమైతే అదనపు బృందాలను ఏర్పాటు చేసి రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈఓ సోమశేఖరశర్మ, ఎంఈఓ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

☆ గురువారం 490 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన వారి గురించి ఎలాంటి ఉత్తర్వులు రాకపోవటంతో వారికి సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించలేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన తర్వాత ప్రక్రియను చేపడతామని డీఈఓ సోమశేఖరశర్మ చెప్పారు.

సెమీస్‌కు ఉమ్మడి ఖమ్మం జట్టు

వరంగల్ క్రీడావిభాగం: రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఓరుగల్లు కోమటిపల్లి మైదానంలో గురువారం జరిగిన పోరులో ఒక్క వికెట్ తేడాతో ఉమ్మడి నిజామాబాద్ జట్టుపై గెలుపొందింది. తొలుత నిజామాబాద్ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 207 పరుగులు చేసింది. ఖమ్మం జట్టు 35 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి సెమీస్‌లోకి దూసుకెళ్లింది.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృత్యువాత

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఎక్కడ పుట్టారో.. ఎక్కడ పెరిగారో కానీ ఖమ్మం నగరంలో అనాథలుగా బతుకుతూ.. బిక్షాటన చేస్తూ ఇద్దరు అనాథలు వేర్వేరుగా గురువారం మృతిచెందారు. కుటుంబ సభ్యులు ఉన్నా మరొక వృద్ధురాలు అనారోగ్యంతో తనువు చాలించారు. వివరాల్లోకి వెళ్తే..


☆ పాత బస్టాండ్ కూడలిలో సాయంత్రం పూట సంచరిస్తుండగా కళ్లు తిరగటంతో కూడలి వద్ద ఓ వృద్ధుడు(65) కూర్చుండిపోయారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ పోలీసులు గౌస్, కృష్ణారెడ్డి అతడికి సపర్యలు చేశారు. మంచినీళ్లు తాగిస్తుండగానే వృద్ధుడు ప్రాణాలు విడిచారు.

☆ సర్వజనాసుపత్రి ఎదుట ఉన్న బస్టాప్‌లో మరో వృద్ధుడు(70) చనిపోయారు. వీరిద్దరి మృతదేహాలను సర్వజనాసుపత్రిలోని మార్చురీకి అన్నం శ్రీనివాసరావు బృందం తరలించారు.

☆ సర్వజనాసుపత్రి ఆవరణలోని కార్ల షెడ్డు వద్ద వల్లెపు అంజమ్మ(60) అనే మహిళ తనువు చాలించారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. స్థానికులు ఆమె మృతిపై కుటుంబీకులకు సమాచారం చేరవేశారు. తాను వేరే ఊరిలో ఉన్నానని ఆమె కుమారుడు ఫోన్‌లో చెప్పగా, కుమార్తె అక్కడికి వచ్చారు. అయితే తాము అద్దె ఇంట్లో ఉంటున్నామని, మృతదేహాన్ని తీసుకెళ్లలేమని ఆమె కుమార్తె చెప్పారు. అంజమ్మ మృతదేహాన్ని అన్నం శ్రీనివాసరావు తమ ఆశ్రమానికి తరలించారు.

భూత దయ చూపుదామయ!

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే



భూమ్మీద మనుషులకు జీవించే హక్కు ఉన్నట్లే జంతువులకూ కొన్ని హక్కులు ఉన్నాయని వాటిని రక్షించాల్సిన బాధ్యత మనదేనని చాటుతోంది ప్రపంచ జంతు దినోత్సవం. ఏటా అక్టోబరు 4న దీన్ని నిర్వహిస్తారు. జిల్లాలోనూ జంతు ప్రేమికులు వాటి హక్కుల పరిరక్షణకు పాటుపడుతున్నారు. మూగజీవులపై భూత దయ చాటుతున్నారు.

★ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని మైదాన ప్రాంతాల్లో వ్యవసాయం, పాడి పరిశ్రమ కోసం జంతువులు, కోళ్లు వంటివి పెంచుతున్నారు. శునకాలు, పిల్లులు, వీధి కుక్కలు మనుషులతో కలిసి జీవిస్తున్నాయి. ఇటీవల శునకాల బెడద ఎక్కువైన నేపథ్యంలో ఖమ్మం నగరంలో కొంతమంది వీటిని విషం పెట్టి చంపుతున్నారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై జంతు ప్రేమికులు కొండబోలు లక్ష్మణ్, బెజ్జంకి శ్రీనివాస్, విక్రమ్‌శర్మ తదితరులు కమిషనర్ అభిషేక్ అగస్త్యకు ఫిర్యాదు చేశారు.

	ఖమ్మం	భద్రాద్రి
పశువులు(తెల్లజాతి)	1,41,117	2,00,844
పశువులు(నల్లజాతి)	3,75,103	1,25,587
గొర్రెలు	6,67,318	1,55,406
మేకలు	1,90,013	2,00,462
పెంపుడు కుక్కలు	13,211	-
నాటు కోళ్లు	20,545	-

రక్షణకు చట్టాలు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ, జి ప్రకారం పౌరులు సాటి జీవులపై కరుణ కలిగి ఉండాలి. జంతువులు, పక్షులను ఇతర ప్రాంతాలకు తరలించేటప్పుడు రైలు, సముద్ర మార్గాల్లో తగిన సదుపాయాలు కల్పించాలి. గోసంరక్షణ చట్టం గోవధను, జంతు బలిని నిషేధించింది. ఆవులను ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్ కబేళాలకు తరలిస్తుండగా జిల్లాలో పలుమార్లు పట్టుకున్నారు. లారీలు, డీసీఎం వాహనాల్లో కుక్కి ఊపిరి ఆడకుండా తరలిస్తున్నారు. ఇవన్నీ చట్టప్రకారం నేరమే.

జంతువులను ప్రేమిద్దాం

జిల్లావ్యాప్తంగా జంతు ప్రేమికులు పశువులు, శునకాలు, కోతులకు ఆహారం పెడుతున్నారు. ప్రభుత్వం కోతుల కోసం ప్రత్యేక ఫుడ్ పార్కులు నిర్మించింది. వీధి కుక్కల నియంత్రణకు మున్సిపాల్టీల్లో సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. జంతువులపై జాలి చూపించాలని, వాటిని హింసించడం, చంపడం సరి కాదని **జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ బి.వేణుమనోహర్‌రావు** పేర్కొన్నారు. ప్రపంచ జంతు దినోత్సవాన మన బాధ్యతలు మరోసారి గుర్తు చేసుకోవాలని కోరారు.



నేడు అవగాహన సదస్సులు

ప్రపంచ జంతు దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. గొత్తికోయలకు జంతువుల ప్రాధాన్యం గురించి వివరిస్తారు. గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తారు. వేట నివారించేందుకు పెట్రోలింగ్ నిర్వహిస్తారు.

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	4,300	7,011	6,500
పాతపత్తి	6,500	7,600	7,400
పెసలు	5,400	7,100	6,000
ఏసీ ఎండుమిరప	11,000	20,000	18,000
ఎండుమిరప	9,000	18,100	17,500
ఏసీ తాలుమిరప	9,000	10,000	9,500
తాలుమిరప	5,000	10,000	6,500

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర • వైరా

వన్యప్రాణులను కాపాడాలి


తల్లాడ నుంచి ప్రదర్శన నిర్వహిస్తున్న ఉమ, అటవీ అధికారులు

తల్లాడ, కల్లూరు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ వన్యప్రాణులను కాపాడాలని తల్లాడ అటవీ క్షేత్రాధికారి జి.ఉమ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా గురువారం తల్లాడ అటవీ క్షేత్రాధికారి ఉమ ఆధ్వర్యంలో తల్లాడ కార్యాలయం నుంచి వెంకటగిరి, వెంగన్నపేట, లోకారం మీదుగా కల్లూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. డీఆర్వోలు శ్రీను, జి.రామ్‌సింగ్, సురేష్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

సమస్య: వీఎం బంజర్‌లోని చర్చి రోడ్డులో డ్రైనేజీ లేక ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోతుంది. వర్షం వచ్చినప్పుడు ఇబ్బందవుతోంది. **- నాగేశ్వరరావు, వీఎం బంజర్**

సమాధానం: చర్చి రోడ్డులో వెంటనే డ్రైనేజీలో పూడికతీసి నీరు సక్రమంగా బయటకు వెళ్లేలా చూస్తాం. **- రవిప్రసాద్, కార్యదర్శి**

– పెనుబల్లి, న్యూస్‌టుడే

దిడుగుపాడు 1వ వార్డులో పారిశుద్ధ్యం సరిగా లేక దోమలు విజృంభిస్తున్నాయి. వీధి దీపాలు కూడా లేవు. **- రంగారావు దిడుగుపాడు**

✔ వెంటనే పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తాం. వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. **- రేవతి, పారిశుద్ధ్య విభాగం**

– మధిర గ్రామీణం, న్యూస్‌టుడే

సగం నిధులు హుళక్కి..


మధిర మున్సిపాలిటీలోని 18వ వార్డులో భూమిపూజ చేసి వదిలేసిన రోడ్డు ఇదే..

మధిర, న్యూస్‌టుడే

మధిర మున్సిపాలిటీలో గత ప్రభుత్వ హయాంలో రూ.30 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వాటిలో కేవలం 50శాతం మాత్రమే పూర్తయ్యాయి. 22 వార్డులుండగా ఒక్కో వార్డుకు 10 నుంచి 12 పనులకు రూ.కోటి వరకు అభివృద్ధికి నిధులు కేటాయించారు. ఎన్నికలకంటే ముందు ఆయా వార్డుల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు భూమిపూజలు చేశారు. దాదాపు రూ.18.5 కోట్లకు సంబంధించిన పనులు ప్రారంభం కాకపోవడంతో వెనక్కివెళ్లాయి.

● 13వ వార్డులో రూ.కోటి పనులకు గాను రూ.60లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. డ్రైనేజీలు నిర్మించాల్సి ఉంది. ● 17వ వార్డులో రూ.కోటికి సంబంధించిన పనులకు భూమిపూజ జరిగినా ఒక్కటీ ప్రారంభం కాలేదు. ● 18వ వార్డులో 12 పనులకు ఒకే ఒక్క సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు.

సమస్య ఏంటి?

▮ ప్రతి వార్డులో పనులు రెండు, మూడు ప్యాకేజీలుగా చేశారు. టెండర్ విధానంలో గుత్తేదారులు దక్కించుకున్నారు. ▮ చాలాచోట్ల కౌన్సిలర్లే చేశారు. ▮ బిల్లులు రావనే సందేహంతో చాలామంది ప్రారంభించలేదు.

'గత అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి నిధులు మంజూరయ్యాయి. రూ.8.8 కోట్ల పనులు మాత్రమే పూర్తయ్యాయి.' **- నరేశ్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ**

మధిర		వైరా
రూ.30 కోట్లు	మంజూరైన నిధులు	రూ.30 కోట్లు
348	గుర్తించిన పనులు	66
145	చేపట్టిన పనులు	31
రూ.11.26 కోట్లు	చేసిన పనుల విలువ	రూ.10 కోట్లు
రూ.18.74 కోట్లు	వెనక్కి వెళ్లిన నిధులు	రూ.20 కోట్లు
203	రద్దయిన పనులు	35
2.1 కి.మీ. సీసీ రోడ్లు 5.25 కి.మీ. డ్రైనేజీ	పూర్తిచేసిన పనులు	5 కి.మీ. సీసీ రోడ్లు, 10 కి.మీ. డ్రైనేజీ
	రద్దయిన పనులు	3 కి.మీ. సీసీ రోడ్లు, 20 కి.మీ. డ్రైనేజీ

రూ.20 కోట్లు వెనక్కి..


వరదనీరు పారేందుకు కాలువ నిర్మించాల్సిన సత్రం బజారు

వైరా, న్యూస్‌టుడే

ఎన్నికలకు ముందు వైరా మున్సిపాలిటీకి మంజూరైన నిధులు పెద్ద మొత్తంలో వెనక్కి వెళ్లాయి. ఏకంగా రూ.20 కోట్ల పనులు రద్దు చేశారు. గతేడాది జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటన మేరకు వైరాకు రూ.30 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్) మంజూరయ్యాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు డంపింగ్ యార్డు, వరద నీరు పారే ప్రధాన కాలువ, జలాశయం ఆనకట్ట సుందరీకరణ పనులను రూ.30 కోట్లతో ప్రతిపాదించారు. గతేడాది మేలో వీటికి శంకుస్థాపనలు చేశారు. పలు వార్డుల్లో కొన్ని సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు.

ప్రభుత్వం మారడంతో.. గతేడాది నవంబరులో శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్ సమయంలో ఆయా పనుల్లో ఎన్ని ప్రారంభం కాలేదో అప్పటి ఉన్నతాధికారులు నివేదిక తెప్పించుకున్నారు. వైరాలో రూ.10 కోట్ల సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయని, మిగిలిన మొదలు కాలేదని అధికారులు నివేదించారు. ఈ క్రమంలో ప్రారంభం కాని వాటిని రద్దు చేస్తున్నట్లు ఈ ఏడాది ఫిబ్రవరిలో కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రూ.10 కోట్ల పనులకు బిల్లులు అందించలేదు.

'ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.30 కోట్లలో రూ.10 కోట్ల పనులు పూర్తి చేశాం. ప్రారంభం కాని వాటి నిధులు వెనక్కి వెళ్లాయి. మళ్లీ మంజూరు చేయించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారు.' **- చింతా వేణు, కమిషనర్**

రద్దయినవి పనుల్లో కొన్ని..

డంపింగ్ యార్డు రూ.3 కోట్లు	వరద పారే కాలువ రూ.3 కోట్లు
ఆనకట్ట సుందరీకరణ రూ.3 కోట్లు	గ్రంథాలయ అభివృద్ధి రూ.కోటి

పెద్ద పనులకు గండి

సత్తుపల్లి, న్యూస్‌టుడే

ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో గత ప్రభుత్వ హయాంలో సత్తుపల్లి పట్టణానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారు. వాటిల్లో దాదాపు రూ.40 కోట్ల నిధులు వెనక్కి వెళ్లాయి. నాడు డీఎంఎఫ్‌టీ నుంచి 36 పనులకు రూ.20 కోట్లు, టీయూఎఫ్ఐడీసీ నుంచి సుమారు 40 పనులకు మరో రూ.30 కోట్లు, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ నుంచి 46 పనులకు రూ.30 కోట్లు కేటాయించారు. ఆయా నిధులతో 23 వార్డుల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు, సెల్లైజ్ డ్రైనేజీలతోపాటు పలు అభివృద్ధి పనులకు హడావిడిగా శంకుస్థాపనలు చేశారు. వీటిలో కేవలం వంద పడకల ఆసుపత్రి భవనం పూర్తి దశకు చేరగా రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథి రెడ్డి సొంత నిధులతో నిర్మించిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు.


అసంపూర్తిగా శాకాహార, మాంసాహార మార్కెట్ భవన సముదాయం

★ విరాట్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారుకానీ ప్రతిపాదిత డ్రైనేజీలు నిర్మించలేదు. ★ జవహర్ నగర్ శివారులో కాల్వొడ్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏవీ ప్రారంభించలేదు. ★ మూడో వార్డు కల్పతరు ఏరియాలో శంకుస్థాపన శిలాఫలకం మాత్రమే దర్శనమిస్తుంది. ★ రాజీవ్‌నగర్‌లో రూ.3కోట్లు మంజూరు చేసినా 40శాతం పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

ఎస్‌డీఎఫ్ ద్వారా వచ్చిన రూ.30 కోట్ల పనులు ప్రారంభం కాక నిలిచిపోయాయి. దాదాపు రూ.50కోట్లకు పైగానే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు ఇతర నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. **- సురేశ్, మున్సిపల్ ఏఈ**

రద్దయిన పనులు

★ రూ.5 కోట్లతో మినీ స్టేడియం ★ రూ.2 కోట్లతో ఫుట్‌పాత్‌ల అభివృద్ధి ★ రూ.2.5 కోట్లతో సామాజిక గృహాలు ★ రూ.కోటితో క్రిస్టియన్ భవన్ ★ స్ట్రీట్ వెండింగ్ జోన్ ★ రూ.2.5 కోట్ల ఎన్టీఆర్‌నగర్ రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ ★ రూ.కోటితో కూడలి అభివృద్ధి ★ రూ.కోటితో ఆధునిక బస్టాప్ నిర్మాణం.

మరికొన్ని ఇలా..

➡ రూ.2 కోట్లతో ప్రారంభించిన షాదీఖానా పనులు పునాది దశలో ఆగిపోయాయి. ➡ రూ.5కోట్లతో వేశ్యకాంతల చెరువును ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసే క్రమంలో కట్టలు పోసి ఆపేశారు. ➡ రూ.2 కోట్లతో మోడ్రన్ దోభీఘాట్ తుది దశకు చేరుకుంది. ➡ రూ.2.65 కోట్లతో అంబేడ్కర్ ఆడిటోరియం పునాది దశలో ఉంది. ➡ రూ.4 కోట్లతో సమీకృత ఆహార భవనం జీప్లస్ టూ స్లాబ్‌లు వేసి ఆపేశారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



కల్లూరు, న్యూస్‌టుడే: మత్స్యకారులకు ఉచితంగా చేపపిల్లల అందించటంపై హర్షం వ్యక్తం చేస్తూ మత్స్యకార్మిక సంఘాల అడ్‌హాక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి చిత్రపటాలకు గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. అడ్‌హాక్ కమిటీ డైరెక్టర్ చింతకాయల వెంకటేశ్వర్లు, లింగాల వాణి, నారాయణ, శీలం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోజూ 40 కుటుంబాల వివరాలు సేకరించాలి

కల్లూరు, న్యూస్‌టుడే: వాచ్యానాయక్ తండాలో కుటుంబ సభ్యుల డిజిటల్‌కార్డుల సర్వేను ఆర్డీవో రాజేందర్‌గౌడ్ ప్రారంభించారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రతిరోజు 40 కుటుంబాలను సర్వే చేయాలని ఆదేశించారు. ఏఎంసీ ఛైర్‌పర్సన్ భాగం నీరజాదేవి, తహసీల్దారు సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నల్లమోతు పిచ్చయ్యకు నివాళి

తల్లాడ, న్యూస్‌టుడే: పినపాక గ్రామంలో నల్లమోతు పిచ్చయ్య వర్ధంతిని గురువారం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ హాజరై స్థూపానికి నివాళి అర్పించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగు నరసింహారావు, తాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

తల్లాడ: తల్లాడ లయన్స్ క్లబ్ సభ్యుడు దొబ్బల శ్రీనివాసరావు తన కుమారుడు అరవింద్ జన్మదినోత్సవం సందర్భంగా 35 మంది నిరుపేదలు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

వరి పంటల పరిశీలన

తల్లాడ, న్యూస్‌టుడే: మిట్టపల్లి, నూతనకల్, వెంగన్నపేట గ్రామాల్లో వరి పంటలను సత్తుపల్లి సహాయ వ్యవసాయ సంచాలకుడు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం పరిశీలించారు. ఏవో తాజుద్దీన్, ఏఈఓ త్రివేణి పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ ప్రవేశాల్లో ప్రతిభ

ఏన్కూరు, న్యూస్‌టుడే: జన్నారం గ్రామానికి చెందిన పేద విద్యార్థిని పగిడిపల్లి మాధవి ఎంబీబీఎస్ ప్రవేశాల్లో సత్తాచాటింది. తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్తూ కూతురును చదివించారు. మాధవి ఇంటర్ ఖమ్మంలో చదివి జనగాం ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించింది.

గుండెపోటుతో మృతి

వైరా, న్యూస్‌టుడే: తెదేపా నాయకుడు, తెలుగు యువత మాజీ అధ్యక్షుడు రాయల నారాయణరావు(48) గురువారం గుండె పోటుతో వైరాలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మార్క్‌ఫెడ్ మాజీ ఉపాధ్యక్షుడు బొర్రా రాజశేఖర్, పురఛైర్మన్ సూతకాని జైపాల్, వైస్‌ఛైర్మన్ ముల్లపాటి సీతరాములు, మిట్టపల్లి నాగి, తెదేపా నాయకులు కేతినేని హరీశ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి చెరుకూరి చలపతిరావు, మండల అధ్యక్షుడు కిలారు సురేందర్ నివాళులర్పించారు.

చెట్ల కొమ్మలు తొలగించిన యువకులు

చింతకాని, న్యూస్‌టుడే: తిరుమలాపురం- తిమ్మినేనిపాలెం మధ్య రెండు చోట్ల భారీ వృక్షాలు రోడ్డుపై పడిపోవటంతో బుధవారం రాత్రి రాకపోకలు నిలిచిపోయాయి. తిరుమలాపురానికి చెందిన యువకులు గురువారం ఉదయం చెట్టును తొలగించి ట్రాఫిక్ చక్కదిద్దారు.

బతుకమ్మ సంబురాల్లో వివాదం

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: భీమవరం గ్రామంలో భారాసకు చెందిన జడ్పీటీసీ మాజీ సభ్యురాలు శీలం కవిత ఆధ్వర్యంలో కొంతమంది మహిళలు రెండు రోజులుగా స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో బతుకమ్మ ఆడుతున్నారు. స్థానిక కార్యదర్శి పంచాయతీ ఆవరణలో అనుమతులు లేకుండా సంబరాలు నిర్వహించవద్దని నోటీస్ బోర్డులో తెలిపారు. ఈ విషయమై గురువారం ఉదయం కవిత ఖమ్మంలో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి కవిత బతుకమ్మ ఆడేందుకు యత్నించగా అనుమతులు లేవంటూ ఎస్సై వారించారు. ఎస్సైతో ఆమె కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు.

ఇద్దరిపై కేసు నమోదు

కల్లూరు, న్యూస్‌టుడే: లక్ష్మీపురం గ్రామంలో దారావత్ సంధ్యను పాత గొడవలు మనసులో పెట్టుకుని మామ దారావత్ లక్ష్మా, బావ లాలు దాడి చేసి కొట్టారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షాకీర్ తెలిపారు.

టీఎఫ్‌డీసీ సర్వే ప్రారంభం

మధిర, న్యూస్‌టుడే: పైలట్ ప్రాజెక్టులో భాగంగా మధిర మున్సిపాలిటీలో చేపట్టిన తెలంగాణ ఫ్యామిలీ డిజిటల్ కార్డు(టీఎఫ్‌డీసీ) సర్వే తీరును గురువారం ఆర్డీఓ గణేష్ పరిశీలించారు. 17వ వార్డులో మొత్తం 170 కుటుంబాలున్నాయి. తహసీల్దార్ ఆర్.రాంబాబు ఆధ్వర్యంలో అధికారుల బృందం ఉదయం నుంచి సర్వే పనులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ షఫీఉల్లా, హెల్త్ అసిస్టెంట్ రేవతి, వార్డు కౌన్సిలర్ మునుగోటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చింతకాని, న్యూస్‌టుడే: డిజిటల్ కార్డుల సర్వే సీతంపేటలో గురువారం చేపట్టారు. సర్వే తీరును ఆర్డీఓ గణేశ్ పరిశీలించారు. వారంపాటు సర్వే చేపట్టనున్నట్లు ఆర్డీవో తెలిపారు. తహసీల్దార్ అనంతరాజు, ఉప తహసీల్దార్ వీరభద్రనాయక్, ఆర్ఐలు పాల్గొన్నారు.

ఏన్కూరు, వైరా, న్యూస్‌టుడే: డిజిటల్ కార్డుల కోసం చేపట్టిన కుటుంబ సర్వేను కోదండరాంపురం తండాలో గురువారం ప్రారంభించారు. డీఎల్‌పీవో రాంబాబు పర్యవేక్షణ చేశారు. అధికారులు ఇంటింటికి కార్డుల కోసం నమోదు చేసుకున్నారు. తహసీల్దార్ శేషగిరి రావు, ఎంపీడీవో ఎస్.రమేశ్, ఎంపీవో జీవీఎస్ నారాయణ, ఏపీఎం హరినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.


మధిర: 17వ వార్డులో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో గణేష్


కోదండరాంపురంలో నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

★ వైరా పట్టణంలోని 14వ వార్డులో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను గురువారం నిర్వహించారు. సర్వేలో పురఛైర్మన్ సూతకాని జైపాల్, తహసీల్దార్ శ్రీనివాస్, కమిషనర్ చింతా వేణుతోపాటు సిబ్బంది పాల్గొన్నారు. మహిళలు, వారి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేశారు.

మందుగుండు సామగ్రి నిల్వ చేసిన వ్యక్తిపై కేసు

మధిర, న్యూస్‌టుడే: మందుగుండు సామగ్రిని అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సంధ్య తెలిపారు. సుందరయ్యనగర్‌లో దోసపాటి విజయ్‌కుమార్ కొత్తగా నిర్మిస్తున్న తన ఇంట్లో ఈ సామగ్రిని అక్రమంగా నిల్వ చేశారని, వీటి విలువ రూ.6,77,028 ఉన్నట్లు వివరించారు.

గొలుసు దొంగిలించేందుకు యత్నం

మధిర, న్యూస్‌టుడే: సిద్ధారెడ్డి బజార్‌లో నివాసం ఉండే యద్దనపూడి జ్యోతి అనే గృహిణి బుధవారం రాత్రి ఎస్ఎఫ్ఎస్ పాఠశాల వెనక వీధిలో వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కునేందుకు యత్నించారు. సదరు మహిళ ప్రతిఘటించడంతో ఆ వ్యక్తి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సంధ్య చెప్పారు.

మండలానికి ఏడు చెక్‌డ్యాంలు మంజూరు


మూడు చెక్‌డ్యాంలు నిర్మితం కానున్న కట్టలేరు వాగు

తల్లాడ, న్యూస్‌టుడే: మండలానికి నూతనంగా ఏడు చెక్ డ్యాంలు మంజూరయ్యాయి. రూ.26.12 కోట్ల వ్యయంతో వీటిని నిర్మించనున్నారు. నూతన నిర్మాణాలతో 2,100 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. భూగర్భ జలాలూ పెరుగుతాయి. కట్టలేరు, నల్లబెల్ల, పెద్ద వాగులపై చెక్‌డ్యాంలు వీటిని నిర్మిస్తారు.

గ్రామం	వాగు	వ్యయం (రూ.కోట్లలో)	సాగు (ఎకరాలు)
పినపాక	కట్టలేరు	3.72	500
రంగంబంజర	నల్లజెల్ల	1.65	250
కలకొడిమ	పెద్దవాగు	2.82	200
అంజనాపురం	పెద్దవాగు	3.3	350
కుర్నవల్లి	కట్టలేరు	8.93	150
మిట్టపల్లి	కట్టలేరు	3.36	450
కుర్నవల్లి	పెద్దవాగు	2.31	200

వర్షపాతం.. అత్యధికం

వైరా, న్యూస్‌టుడే

వ్యవసాయ శాఖ వైరా డివిజన్‌లో సెప్టెంబరులో అత్యధిక వర్షపాతం నమోదైంది. పూర్తి వ్యవసాయాధారిత ప్రాంతంగా ఉన్న డివిజన్‌లోని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. నెల ఆరంభం నుంచి వారంపాటు అధిక వర్షాలు నమోదు కావడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డప్పటికీ అనంతరం మెల్లగా కోలుకున్నారు. వరి, పత్తి, మిరపతోపాటు ఇతర పంటలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. డివిజన్‌లో అత్యధికంగా వరి సాగు చేసే ప్రాంతంగా వైరాకు పేరుండగా పత్తి సాగు చేసే ప్రాంతాలుగా కొణిజర్ల, ఏన్కూరు పేరొందాయి. మిరప సైతం ఎక్కువగా సాగు చేస్తుంటారు.

రెట్టింపు స్థాయిలో...

సెప్టెంబర్ నెలకు సంబంధించి వైరా, కారేపల్లి మండలాల్లో రెట్టింపు వర్షపాతం నమోదైంది. కొణిజర్లలోనూ ఇంచుమించుగా ఇదే తరహాలో కురిసింది. భారీ వర్షాలతో మధ్యతరహా వైరా జలాశయం పొంగిపొర్లింది. రోజుల తరబడి అలుగులు ప్రవహించడంతో అనేక టీఎంసీల నీరు వృథాగా సముద్రం పాలయ్యాయి. నాలుగు మండలాల్లోని సుమారు రెండొందలకు పైగా చెరువుల్లో జలకళ కనిపిస్తుంది. అన్ని చోట్ల జలవనరులు సమృద్ధిగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్షపాతం(ఎంఎం) ఇలా..

మండలం	సాధారణం	కురిసింది	ఎక్కువ నమోదైంది(శాతం)
ఏన్కూరు	194.3	246.9	27
కొణిజర్ల	185.5	362.3	95
కారేపలి	187.4	409.6	119
వైరా	199	405.1	104


సత్తుపల్లి: శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు


వైరా: అష్టగుర్తిలో అమ్మవారికి పూజలు


ఏన్కూరులో బాలత్రిపురసుందరీదేవిగా అమ్మవారు

కొలువైన అమ్మవారు.. బతుకమ్మ సంబురాలు


ఆత్కూరులోని ఓ ప్రైవేటు విద్యాలయంలో..


మర్లపాడు శిర్డీసాయి మందిరంలో బతుకమ్మ పూజ నిర్వహిస్తున్న మహిళలు


ముదిగొండ మండలం వల్లభిలో..

న్యూస్‌టుడే బృందం: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కనకదుర్గమ్మ అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. మధిర, చింతకాని, ఎర్రుపాలెం, తల్లాడ, కల్లూరు, వైరా, కారేపల్లి, ఏన్కూరు, కొణిజర్ల తదితర మండలాల్లో శరన్నవరాత్రి, బతుకమ్మ సంబురాలు గురువారం ఘనంగా నిర్వహించారు.

కారేపల్లి, న్యూస్‌టుడే: దేవాదాయశాఖ ఆధ్వర్యంలో దసరాకు ఉసిరికాయలపల్లిలో నిర్వహించే శ్రీకోటమైసమ్మ జాతరకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కు గురువారం ఆహ్వానం పలికారు. ఈవో వేణుగోపాల చార్యులు, ఉద్యోగి పగడాల మోహన్ కృష్ణ వైరాలో మర్యాద పూర్వకంగా కలిసి సంబంధించిన పత్రికను అందించారు.


దెందుకూరులో అమ్మవారి వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు


కల్లూరు మారెమ్మ అమ్మవారి ఆలయానికి వస్తున్న భక్తులు

అయ్యప్ప భక్తులకు రూ.లక్ష విరాళం



కల్లూరు, న్యూస్‌టుడే: అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి దేవరపల్లి నాగప్రసాద్, దేవరపల్లి పట్టాభి, వారి కుటుంబ సభ్యులు వంట సామగ్రి నిమిత్తం రూ. లక్ష నగదును అఖిల భారత అయ్యప్ప ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు కాటేపల్లి రజనీకాంత్‌కు అందజేశారు. కార్యక్రమంలో కాటేపల్లి కిరణ్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చలువాది నగేష్, మోటమర్రి వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

5న 'నెలనెలా.. వైద్య శిబిరం'

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: సీపీఎం రెండో పట్టణ కమిటీ, బోడేపూడి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహించే 'నెలనెలా.. వైద్య శిబిరం' కార్యక్రమాన్ని ఈనెల 5న ఖమ్మం మంచికంటి భవన్‌లో ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, వై.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఆసుపత్రి ఇండస్ సౌజన్యంతో మధుమేహం, రక్తపోటు, కంటి, నరాలు, మూత్రపిండాలు, సీరం, క్రియాటిన్ వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని, అవసరమైన మందులను ఉచితంగా అందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఠాణాను సందర్శించిన నార్కోటిక్స్ సీఐ

ఖానాపురం హవేలీ, న్యూస్‌టుడే: రఘునాథపాలెం పోలీసు ఠాణాను నార్కోటిక్స్ సీఐ బి.రాము గురువారం సందర్శించారు. ఠాణా సీఐ ఉస్మాన్ షరీఫ్‌తో సమావేశమయ్యారు. ఇటీవల ఠాణాలో నమోదైన గంజాయి కేసుపై ఆరా తీశారు. డ్రగ్స్ కేసులు నమోదు సమయంలో పాటించాల్సిన విధివిధానాలపై ఠాణా సీఐకు అవగాహన కల్పించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 93944 50199
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081



సమస్య: నగరంలోని గణేష్‌నగర్ వీధి దీపం వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా..' దృష్టికి తెచ్చారు. సమస్యను ఈఈ కృష్ణలాల్‌కు వివరించగా ఆయన ఆదేశాల మేరకు వీధి దీపం ఏర్పాటు చేశారు.

సమస్య: రెహమత్‌నగర్‌లో వీధి దీపం నాలుగు నెలలుగా వెలగడం లేదు: **స్థానికుడు**

సమాధానం: రెండు రోజుల్లో మరమ్మతులు చేయిస్తాం: **కృష్ణలాల్, ఈఈ**

✆ కాల్వొడ్డు ప్రాంతంలో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయి: **అనీల**
✔ వీధి కుక్కల నియంత్రణకు ఇప్పటికే చర్యలు చేపట్టాం: **సంపత్‌కుమార్, జవాన్**

✆ బోడేపూడి స్తూపం వెనుక ప్రాంతానికి చెత్త బండి రావడం లేదు. ఈ ప్రాంతంలో ఎక్కడి చెత్త అక్కడే ఉంది: **విజయ**
✔ చెత్తబండి పంపేందుకు చర్యలు తీసుకుంటాం: **సంపత్‌కుమార్, సహాయ కమిషనర్**

✆ ఖానాపురం అభయ వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే మొదటి దారిలో కాల్వలు సరిగా లేకపోవడంతో ఇబ్బందిగా మారింది: **స్థానికుడు**
✔ పరిశీలించి ప్రతిపాదనలు చేస్తాం: **కృష్ణలాల్, ఈఈ**

– ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

సంపద లెక్కలు తేలాలి: గౌరీశంకర్

ఖానాపురం హవేలీ, న్యూస్‌టుడే: కులగణన, ఆర్థిక సర్వే జరిగితే రాష్ట్రంలో 90 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల వద్ద ఉన్న సంపద ఎంతో, 10 శాతం ఉన్న అగ్రవర్ణ కులాల వద్ద ఉన్న సంపద ఎంతో తేలిపోతుందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు జూలూరు గౌరీశంకర్ అన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు జరిపేదాకా బీసీలంతా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సి ఉందన్నారు. గురువారం సాయంత్రం ఖమ్మం మధురానగర్ కాలనీలోని శ్రీలక్ష్మి కృష్ణ సేవా సమితి భవనంలో ఆచార్య జి.లక్ష్మణ్ రచించిన 'కులగణన రిజర్వేషన్లు-బీసీల అవగాహన' పుస్తకాన్ని ఆవిష్కరించారు. బిల్లాల తిరుమలరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో గౌరీశంకర్ మాట్లాడారు. కులగణన జరిగితే బీసీలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం దక్కుతుందన్నారు. బీసీలు ప్రాధేయపడే స్థాయి నుంచి పోరాడే స్థాయికి ఎదిగినప్పుడే హక్కులు సాధించుకోగలుగుతామన్నారు. రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీలు అసెంబ్లీలో 19 మంది ఉండటం బాధాకరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్జేసీ కృష్ణ, కూరాకుల నాగభూషయ్య, సుందర శ్రీనివాస్, కత్తి నెహ్రూ గౌడ్, బీరి మల్లూర్, అమరగాని వెంకన్న గౌడ్, గోవిందు, రోషయ్య తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గౌరీశంకర్, రచయిత లక్ష్మణ్ బీసీ నాయకులు

యువ జనం.. పర్యాటక సైన్యం

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే

చరిత్రను సరిగ్గా అర్థం చేసుకుంటే భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దుకోవచ్చు. మన దేశ వారసత్వ సంపద ఇందుకు స్ఫూర్తినిస్తుంది. చారిత్రక ప్రదేశాలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో యువతను భాగస్వాములను చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'యువ పర్యాటక క్లబ్'లు ఏర్పాటు చేసి పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. యువతను సాంస్కృతిక రాయబారులుగా తీర్చిదిద్దుతోంది. ఉన్నత పాఠశాలలు మొదలు డిగ్రీ కళాశాలల వరకు విద్యార్థులను ఇందుకు ఎంపిక చేస్తోంది. రాష్ట్రంలోని పర్యాటక స్థలాలు, వాటి చారిత్రక, సాంస్కృతిక గొప్పతనాన్ని అధ్యయనం చేసి ఇతరులకు అవగాహన కల్పించడం వీరి బాధ్యత. పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంతోపాటు యువతకు ఉపాధి కల్పించడం ఈ కార్యక్రమం ఉద్దేశం.

YUVA TOURISM CLUB



పర్యాటకంపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

లక్ష్యాలు ఇలా..

'ఆజాదీకా అమృత్ మహోత్సవ్' కార్యక్రమాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 'యువ పర్యాటక క్లబ్'లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. యువతకు దేశ, రాష్ట్ర భౌగోళిక విశిష్టతలు, విభిన్న సంస్కృతులపై అవగాహన పెంపొందిస్తారు. వివిధ ప్రాంతాల్లో పర్యటించి అక్కడి వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రాంతాలపై అధ్యయనం చేస్తారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లి వారివారి విశిష్టతలు తెలియజేస్తారు. యాత్రలు, అనుభూతుల కథలు, షార్ట్‌ఫిల్మ్ తదితర అంశాలు పర్యాటక వార్తాంశాలుగా రాసేందుకు పోటీలను నిర్వహిస్తారు. జాతీయ, రాష్ట్రీయ సమగ్రతను, స్నేహ సౌభ్రాతృత్వాన్ని అంతర్జాతీయంగా వ్యాప్తి చేస్తారు. పర్యావరణ పరిరక్షణ బాధ్యతలను పెంచుతారు.

విద్యాసంస్థలు....

జిల్లా	ఉన్నత	జూనియర్	డిగ్రీ కళాశాలలు
ఖమ్మం	470	134	64
భద్రాద్రి కొత్తగూడెం	131	104	28

ఇవీ కార్యకలాపాలు

పట్టణాలకు సమీపంలో ఉన్న పర్యాటక కేంద్రాల వరకు ట్రెక్కింగ్, హైకింగ్, సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తారు. వ్యాస రచన, క్విజ్, లోగో డిజైనింగ్, చిత్రలేఖనం, పోస్టర్ డిజైనింగ్ వంటి అంశాల్లో పోటీలు నిర్వహిస్తారు. సామాజిక, ఆర్థిక రంగాల్లో పర్యాటకం ప్రాధాన్యంపై ఉపన్యాస పోటీలు నిర్వహించి చర్చిస్తారు. స్వచ్ఛ తెలంగాణ కోసం పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించడం, పర్యాటక స్థలాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించటం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారు. చారిత్రక వారసత్వ, సాంస్కృతిక అంశాల్లో గ్రామ, మండల, జిల్లా ప్రత్యేకతల్ని అధ్యయనం చేసి ప్రచారం చేస్తారు.

విద్యాసంస్థల బాధ్యత

విద్యాసంస్థల్లో 'యువ టూరిజం క్లబ్'లు ఏర్పాటు చేస్తారు. ఉపాధ్యాయుడు/అధ్యాపకుడు సమన్వయకర్తగా ఉంటారు. క్లబ్ సభ్యులకు నిరంతరం పర్యాటక అంశాలపై కార్యక్రమాలు నిర్దేశిస్తారు. ప్రతినెల ఒకసారైనా క్లబ్ సభ్యులు సమావేశమై ప్రణాళిక తయారు చేసుకుంటారు. కార్యక్రమాల నిర్వహణపై నివేదిక సమర్పిస్తారు. ఒక క్లబ్ సభ్యులతో జిల్లాలోని మరో క్లబ్ సభ్యులు సమావేశమై వారి అనుభవాలు పంచుకుంటారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న గుండాల కృష్ణ, రామారావు తదితరులు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: మున్నేరు వరదల్లో నష్టపోయిన మున్నూరు కాపు సామాజిక వర్గీయులకు అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ అందించిన నిత్యావసర వస్తువులను సంఘం నాయకులు గుండాల కృష్ణ, తోట రామారావు గురువారం పంపిణీ చేశారు. కాల్వొడ్డు ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. మెంతుల శ్రీశైలం, మాటేటి నాగేశ్వరరావు, కనకం భద్రయ్య, జనార్దన్, కిరణ్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లతల పరదా.. ఔరా అనేలా..!

ఖమ్మం పాతబస్టాండ్‌లోని పార్కింగ్ ప్రహరీ, మయూరి వంతెన మధ్య మార్గంలోని ఓ గోడకు అలంకరణ తీగలు అల్లుకుపోయాయి. అటువైపు రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

– ఈనాడు, ఖమ్మం



అలసత్వం వహించవద్దు: డీపీఓ

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: గ్రామాల్లోని వీధులను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రామాభివృద్ధికి సహకరించాలని డీపీఓ ఆశాలత అన్నారు. మండలకేంద్రంతో పాటు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడున్న రికార్డులను పరిశీలించారు. గ్రామపంచాయతీలో దోమలు ప్రబలకుండా, తరుణవ్యాధులు సోకకుండా ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయించాలని సూచించారు. శ్మశానవాటిక, గ్రామ నర్సరీల్లో ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సుజాత తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా..!

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: సర్దార్ పటేల్ స్టేడియం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిలో రెండు క్రాసింగులు ఉన్నాయి. ఇక్కడ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో మలుపుల వద్ద ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లు పెట్టారు. వీటికి కొందరు బ్యానర్లు కట్టారు. దీంతో ఆవలి వైపు వస్తున్న వాహనాలు, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు కనిపించడం లేదు. కొద్ది రోజులుగా ఆ బ్యానర్లు అలానే ఉన్నా పోలీసులూ వాటిని గమనించడం లేదు. ఇల్లెందు రోడ్డు స్టేడియం ఎదురుగా ఉన్న క్రాసింగ్ బారికేడ్‌కు కట్టి ఉన్న బ్యానర్ చూడవచ్చు.



ఇల్లెందు రోడ్డులో బారికేడ్‌కు కట్టిన బ్యానర్

వరి పైరుకు నష్టం

కూసుమంచి, న్యూస్‌టుడే: మండలంలో గాలిదుమారం వరి రైతును తీవ్రంగా నష్టపర్చింది. బావులు, బోర్లు, పాలేరు జలాశయం ఆధారంగా సాగుచేసిన వరిపైర్లు 80 నుంచి 90 రోజుల వయసులో పొట్టదశలో ఉండగా గాలిదుమారం, వర్షం ప్రభావంతో పొలాలు నేలవాలాయి. గింజకట్టి ఉండటంతో బరువు కారణంగా పైరు లేచే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. మళ్లీ వర్షం వస్తే.. పూర్తిగా నష్టపోవాల్సి వసుందని ఆందోళన చెందుతున్నారు. కూసుమంచితోపాటు గుర్వాయిగూడెం, నర్సింహులగూడెం, కొత్తూరు, ఎర్రగడ్డతండా ప్రాంతాల్లో నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు.



కూసుమంచి సమీపంలో నేలవాలిన వరిపైరు

పరిశీలన: గాలి దుమారంతో నేలకొరిగిన వరి పైర్లను ఏడీఏ సరిత, ఏవో వాణి గురువారం పరిశీలించారు. అనంతరం కూసుమంచిలో పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మానస పాల్గొన్నారు.

సీఎంఆర్ కుంభకోణంపై విచారణ జరిపించాలి

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: కస్టం మిల్లింగ్ బియ్యం కుంభకోణంపై సీబీసీఐడీ విచారణ జరిపించాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో సీఎంఆర్ బియ్యం విషయంలో అధికారులు, రైస్ మిల్లర్లు కుమ్మక్కై రూ.400 కోట్లు ప్రజా ధనాన్ని మింగేశారని ఆరోపించారు. ప్రతి ఏడాది వందల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తీసుకొని ఎగవేతకు పాల్పడుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

హమాలీల బదిలీలు ఆపాలి: సీఐటీయూ

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ఇటీవల ఎఫ్‌సీఐ గోదాములో అనేక ఏళ్లుగా పని చేస్తున్న 100 మంది కార్మికులను అకారణంగా ఖాజీపేటకు బదిలీ చేయడం అన్యాయమని, బదిలీలను వెంటనే ఆపాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు యర్రా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. నగరంలోని ఎఫ్‌సీఐ గోదాము వద్ద హమాలీల బదిలీలను నిరసిస్తూ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మా విష్ణు, కల్యాణం వెంకటేశ్వరరావు, మల్లికార్జున్, హమాలీలు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారం సేకరించాలి

కూసుమంచి, న్యూస్‌టుడే: ఎలాంటి తప్పిదాలకు తావీయకుండా సమగ్ర సమాచారంతో కుటుంబ సర్వే నిర్వహించాలని కార్యక్రమ ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ సూచించారు. పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించిన ధర్మాతండాలో గురువారం సర్వే తీరును పరిశీలించారు. పలు సూచనలిచ్చారు. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, రాజేశ్వరి, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, ఉప తహసీల్దార్ శ్రీలత, ఎంపీవో రామచంద్రరావు పాల్గొన్నారు.

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను వెంకటగిరి పంచాయతీలోని కోటనారాయణపురంలో గురువారం ప్రారంభించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి అధికారి రాజేశ్వరి, తహసీల్దారు రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్ సర్వేలో పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం

ఖానాపురం హవేలీ, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో వివాహిత తన నివాసంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఖమ్మం రామన్నపేట కాలనీలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... షేక్ రుస్ర(30) ఆమె భర్త యాకూబ్ పాషా కొంత కాలంగా కాలనీలో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు ఖానాపురం హవేలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో సినిమాలు.. శ్రీనివాస: సత్యం సుందరం శ్రీసాయిరాం: స్వాగ్, శ్రీ తిరుమల, వినోద: దేవర పార్ట్-1 కేపీఎస్: రాంనగర్ బన్నీ(రెండు ఆటలు), జోకర్(రెండు ఆటలు)

కుటుంబ డిజిటల్ సర్వేపై కలెక్టర్ సమీక్ష

ప్రతి ఒక్కరి వివరాలు సేకరించాలని సూచన

ఖమ్మం కార్పొరేషన్, ఖానాపురం హవేలీ, న్యూస్‌టుడే: కుటుంబ డిజిటల్ కార్డు నమూనా సర్వేను కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో గురువారం నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తున్న సర్వేపై సమీక్షించారు. ఖమ్మం నగరంలోని 54వ డివిజన్, రఘునాథపాలెం మండలం రాములుతండాల్లో సర్వే చేపట్టినట్టు తెలిపారు. రేషన్‌కార్డులకు, కుటుంబ డిజిటల్ సర్వేకు ఎటువంటి సంబంధం లేదన్నారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య, తహసీల్దార్‌లు సీహెచ్.స్వామి, లూథర్ విల్సన్, సహాయ కమిషనర్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

✦ రాములతండాలో సర్వేను కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. స్వయంగా కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కుటుంబ సభ్యుల ఫొటోను స్వయంగా తీశారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్, తహసీల్దార్ లూథర్‌విల్సన్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి ఇతర అధికారులు ఉన్నారు.



రాములతండాలో గిరిజన దంపతులను ఫొటో తీస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ప్రతి వారం మూడు సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో భోజనం నాణ్యతను అధికారులు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, ఎస్సీ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, బీసీ అభివృద్ధి అధికారి జ్యోతి, ఆర్‌సీఓలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు వైద్యం

గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డీఎంహెచ్‌ఓ సుబ్బారావు, జడ్పీ ఉప సీఈఓ నాగలక్ష్మి, డీపీఓ ఆశాలత, జిల్లా పశుసంవర్ధక అధికారి వేణుమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

✦ కలెక్టరేట్ సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన మందిరంలో రెవెన్యూ ఉద్యోగులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏఓ అరుణ, విభాగాల పర్యవేక్షకులు పాల్గొన్నారు.



ఖానాపురంలో నిర్వహించిన బహుజన బతుకమ్మ వేడుకలో విమలక్క తదితరులు



కూసుమంచి బస్టాండ్ కూడలిలో కోలాటం వేస్తున్న చిన్నారులు



తనికెళ్ల విజయ కళాశాలలో ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, అధ్యాపకులు, సిబ్బంది

వాడవాడలా బతుకమ్మ వేడుకలు



ఖమ్మం భారాస కార్యాలయంలో..

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: అటుకుల బతుకమ్మ వేడుకలను గురువారం నిర్వహించారు. మహిళలు, యువతులు అందమైన బతుకమ్మలను పేర్చి సాయంత్రం నగరంలోని పలు ప్రాంతాల్లో సందడి చేశారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఖానాపురంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో విమలక్క పాల్గొన్నారు. నగరంలో శరన్నవరాత్రి వేడుకలు నిర్వహించారు.

ఖమ్మం గ్రామీణం, నేలకొండపల్లి, న్యూస్‌టుడే: ఖమ్మం గ్రానైట్ ఆల్ బెంగాలీ సర్వజనిక్ దుర్గాదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గుర్రాలపాడులో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలను రాయల నాగేశ్వరరావు ప్రారంభించారు.



ద్వారకానగర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



రెజొనెన్స్ శ్రీనగర్‌కాలనీ పాఠశాలలో డైరెక్టర్ కొండా కృష్ణవేణి, సిబ్బంది, చిన్నారులు



ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ జి.పద్మావతి, అధ్యాపకులు, విద్యార్థినులు



పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పర్యవేక్షణ లోపం.. పాదచారులకు శాపం!



ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో..

ఖమ్మం నగర సుందరీకరణలో భాగంగా రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన పాదచారుల మార్గం అనేక చోట్ల ఆక్రమణకు గురవుతోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కొందరు ఇష్టానుసారంగా ఆక్రమిస్తున్నారు. అక్కడక్కడ టైల్స్ పగిలిపోయాయి. పోల్స్ విరిగిపోయాయి. మార్గంలో ఏర్పాటు చేసిన వీధిదీపాలు దొంగలపాలవుతున్నాయి. ఈ మార్గం గుండా నడిచేందుకు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ వసుంధర మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలను తొలగిస్తామన్నారు.

– ఈనాడు, ఖమ్మం



ఇల్లెందు క్రాస్‌రోడ్డు వద్ద ఆక్రమణకు గురైన పాదచారుల మార్గం